# కథా కేళి

మల్లాది వెంకట కృష్ణమూర్తి

సినిమా వాళ్ళకి ఒకోసారి ఒకోసీజను. 'మూగ మనసులు' హిట్ అవడంతో మనసులు కాని మనసులు చాలా వచ్చాయి. అలాగే అన్నా చెల్లెళ్ళ అనుబంధం మధ్య పాటలు కొన్ని సినిమాల్లో వరసగా వచ్చాయి. జ్యోతి లక్ష్మి డాన్సులేని సినిమాలు అపుడు వుండేవి కావు. ఓ సినిమా విజయవంతం అయే ప్రతి అంశానికి ఓ సీజనుని సృష్టిస్తుంటారు సినిమా వాళ్ళు.

అలాగే ఈ మధ్య తెలుగు నవలలు సినిమాలుగా రావడం సీజనయింది. 'మద్రాసు వుచితంగా వెళ్ళి రావాలంటే, సినిమాకి పనికొచ్చే ఓ నవల రాయడమే మంచి మందా' అన్నట్లుగా అయిపోయింది. ఆకోవలోనే ఆ మధ్య ఓ నిర్మాత నాకు ఫోన్ చేసాడు.

"ఇక్కడికి షూటింగ్ పనిమీద వచ్చాం. వారం రోజులుంటాం. తర్వాత పిక్చర్‌కి మంచి కథకావాలి. మీ దగ్గర వెరైటీ సబ్‌జెక్ట్స్ ఏమైనా వుంటే చెప్పండి" అన్నాడాయన.

ఆ రాత్రి ఆయన హోటల్ గదికి వెళ్ళాను. షూటింగ్‌తో అలసిపోయిన నిర్మాత, దర్శకులు శుభ్రంగా స్నానం చేసి గ్లాస్కో లాల్చి, పంచె కట్టుకుని మంచం మీద బాసింపట్టు వేసుకుని కూర్చున్నారు.

"మీ దగ్గర సబ్‌జెక్ట్సేమైనా వున్నాయా?" అడిగాడు నిర్మాత.

"ఉన్నాయండి. ఏ సబ్‌జెక్ట్ కావాలంటే అదుంది. ఫిజికల్ సైన్స్ మీద 'కొత్త శత్రువు' రాసాను. జువాలజీ సబ్ జెక్ట్‌మీద 'నత్తలొస్తున్నాయి జాగ్రత్త' అనే నవల రాశాను. సైకాలజీ మీద 'మిష్టర్ సంపత్' రాసాను. ప్రస్తుతం ఏరో డైనమిక్స్ మీద 'ఎయిర్ హోస్టెస్' అనే నవల రాస్తున్నాను. మేథమేటిక్స్ మీద..."

"సబ్‌జెక్ట్స్ అంటే అవికావు. కథలే" చెప్పాడు దర్శకుడు నా వాగ్ధాటికి అడ్డుపడి.

"అలాగా. ఉన్నాయండి."

"శారద, వేలు, అర్జున్‌కి సరిపడే సబ్‌జెక్ట్...అదే... కథ కావాలి. వచ్చేనెలే షూటింగ్..."

నవలల కట్ట దర్శకుడికి ఇచ్చాను.

మీరే ఎన్నిక చేసుకోండి."

ఆ కట్టవంక ని[illegible]త్సాహంగా చూసి చెప్పాడు "ఇవి చదివే తీరికెక్కడుందండ.


"నాకు రాయడం తప్ప చెప్పటం అంతగా రాదండి. మొత్తం నవలుందిగా. ఇంక చెప్పటం దేనికి చద వచ్చుగా?"

"చదవటం అలవాటు లేదండి" చెప్పాడు నిర్మాత.

లక్షలు పెట్టి తీసే సినిమాకి కథ ముఖ్యమయినపుడు, పనికొస్తుందా లేదా అని నిర్ణయించడానికి, మంచిదేదో కనుక్కోడానికి పుస్తకాలు చదవం అంటే నాకు ఆశ్చర్యం వేసింది.

"మీరు చెప్పిన ఆర్టిస్టులకి సరిపడే కథ లేదు".

నిరుత్సాహంగా చూసారు నావంక.




"పోనీ కొత్తది తయారు చేస్తారా?" అడిగాడు నిర్మాత.

"ఆపని చెయ్యండి. మీకు తెలుసుగా వేలు, శారద ఎలాంటి కేరక్టర్స్ వేస్తుంటారో. అర్జున్ ఫైట్స్ బాగా

## సినిమా కథ

చేస్తాడు. అది దృష్టిలో వుంచుకుని కథ

"కథ చెప్పడం కంటె రాసి తీసుకురావడమే నాకు తేలికండి" చెప్పాను.

"మీరు క్లుప్తంగా రాసి తీసుకురండి. మా అసిస్టెంట్ చదివి మాకు చెప్తాడు" చెప్పాడు దర్శకుడు.

'ఈయన మెదడుకి కంటి కన్నా చెవివించే దగ్గర దారిలా వుంది' మనసులో అనుకున్నాను.

నాలుగు రోజుల తర్వాత కలవాలని నిర్ణయించుకున్నాం. నవల రాయడానికి అధికంగా కృషి చేయాలి. ఏదో ఓ కొత్త సబ్‌జెక్ట్‌కి సంబంధించింది రాస్తుంటాను కాబట్టి, సినిమాలకి అలా కృషి చేయటంలో తప్పులేదని శారద నటించిన చిత్రాల కాసెట్స్ అరడజను, వేలు నటించినవి ఓ అరడజను, అర్జున్ నటించినవి ఓ అరడజను తెప్పించి వాటిని చూసాను. నాకు ఓ అవగాహన ఏర్పడింది ఆ ముగ్గురున్న సినిమా కథ ఎలా వుండాలో.

అరడజను తెల్ల కాగితాలమీద కథ సినాప్సిస్ తయారు చేసి పట్టుకెళ్ళాను. ఎప్పటిలా మంచంమీద బాసింపట్టులో కూర్చుని వున్నారు ఇద్దరు.

"మీరు రాసింది చదవండి. చెప్పక్కర్లేదు" చెప్పాడు నిర్మాత.

దర్శకుడు సిగరెట్ వెలిగించి చదవమన్నట్లుగా నా వంక చూసాడు.

గొంతు సర్దుకుని చదవ సాగాను.

"రాజశేఖర్ రైలు లేటయిందేమో కనుక్కోడానికి రైల్వే స్టేషన్కి ఫోన్ చేసాడు. ఎంగేజ్డ్ వచ్చింది. కాసేపాగి మళ్ళీ ఫోన్ చేసాడు. ఈసారి కూడా ఎంగేజ్డ్ మూడోసారి అవతలవైపు వచ్చారు. 'హలో...ఏలూరు వెళ్ళే బండి లేటుందాండి?" అడిగాడు రాజశేఖర్. అవతలి వైపునుంచి జవాబు లేదు. 'హలో...హలో' అరిచాడు రాజశేఖర్. ఫోన్ తీసి పక్కన పెట్టారని గ్రహించి ఎంక్వయిరీ కౌంటర్‌లోని వ్యక్తిని తిట్టుకున్నాడు. టయిమవుతోందని సూట్‌కేసుతో బస్‌స్టాప్‌కి చేరుకున్నాడు. మొదటి రెండు బస్సులు స్టాపులో ఆగలేదు. స్టాప్ దాటి ఆపారు. వాటి దగ్గరకి పరుగెత్తాడు గాని, రాజశేఖర్ చేరుకునేలోగానే అది కదిలి వెళ్ళిపోయింది. మూడో బస్సులో చివరికి ఎట్లాగో ఎక్కాడు. కిటకిట లాడుతోంది. సూట్‌కేస్ ఎవరికో తగిలితే 'కళ్ళులేవా' అని తిట్టాడాయన. రాజశేఖర్ 'వుంటే చూసుకుని తప్పుకోరాదు' అన్నాడు. ఇద్దరు పోట్లాడుకుంటుంటే కండక్టర్ సర్ది చెప్పాడు. తర్వాత బస్ స్టాప్ రైల్వే స్టేషన్ అనగా రాజశేఖర్‌కి సీట్ దొరికింది. బస్ దిగి రైల్వే స్టేషన్‌లోకి అడుగు పెట్టాడు. ఏలూరు వెళ్ళే బండి కిటకిటలాడుతోంది. రాజశేఖర్ సీట్లో ఎవరో కూర్చుని వున్నారు. అతనికీ అదే నంబరు సీట్ అలాటయివుంది. అది రైల్వే రిజర్వేషన్ క్లర్క్ చేసిన పొరబాటు అని గ్రహించారు...

"ఆగండి" చెప్పాడు దర్శకుడు.

ఆగాను.

"మీకు సినిమా స్క్రిప్ట్‌లతో పరిచయం లేదనుకుంటాను."

"లేదండి. ఏం?"

"ఇందాక రైల్వే స్టేషన్‌కి రాజశేఖర్ ఫోన్ చేసాడన్నావు. మొదటి సారి రింగ్ చేయగానే సమాధానం రావాలి. రెండు మూడు సార్లు ఫోన్ చేయడం దేనికి? అసలు డైరెక్టరీ చూడటం దేనికి?"

"మీరెప్పుడూ రైల్వే ఎంక్వయిరీకి ఫోన్ చేసినట్లు లేదు. మొదటి సారి రింగయితే అది ఎనిమిదో వింతవుతుంది ప్రపంచంలో. తర్వాత రైల్వే ఎంక్వయిరీ నంబర్ బట్టీ లేదు కదా రాజశేఖర్‌కి. ఎప్పుడు కావాలనుకుంటే అప్పుడు చూసుకోడానికేగా డైరెక్టరీ?"

"బోల్డంత ఫుటేజ్ వేస్టవుతుంది సహజత్వానికి పోతే. మీరు చూస్తూనే వుంటారు. సినిమాల్లో ఏ పాత్ర ఫోన్ చేసినా ఎప్పుడు అవతలివైపు రింగయి ఎత్తుతారు కాని ఎంగేజ్డ్ వచ్చి రెండు మూడు సార్లు ట్రయ్ చెయ్యరు. అలాగే బస్సు స్టాప్‌లో రెండు బస్సులు స్టాప్‌లో ఆగక పోవడం, రాజశేఖర్ పెట్టె పట్టుకుని పరిగెత్తడం తీసెయ్యాలి."

"మీరు మావూళ్ళో రేపు ఉదయం తొమ్మిది నుంచి పదింపావు దాకా అయిదో నంబరు బస్సు స్టాప్ దగ్గర నిల్చుని చూడండి. నే రాసిందాంట్లో అబద్ధం వుందేమో తెలుస్తుంది."

"అలాగే బస్సులో ఎక్కగానే ఖాళీ సీటు వుంటే అందులో కూర్చోవాలి కాని హీరో కాబట్టి నిలబడి ప్రయాణం చేయకూడదు. రైల్లో ఒకే సీటుని ఇద్దరికి రైల్వే క్లర్క్ పొరబాటున రిజర్వ్ చేసే అవకాశం వున్నా అది కూడా వుండకూడదు. టక టక టక వెళ్ళిపోవాలి కథ."

"కాని ప్రతి మధ్య తరగతి కథానాయకుడి జీవితంలో అతను రోజూ జరిగే వీటిని తిట్టుకుంటూ వుంటాడు కదండి. అతని జీవితం టక టక టక సినిమా కథలా సాగిపోవటం లేదుగా? అందుకే ఇలా రాసాను. అసలిలా జరగదని వూహించడమే కష్టం. ఆ మంచి రోజులు ఎప్పుడు వస్తాయో?"

నిర్మాత చిన్నగా ఆవులించి చెప్పాడు.

"మిమ్మల్ని మరోసారి కలుస్తాను. రేపు ఉదయం షూటింగ్ గురించి మాట్లాడు కోవాలి".

వెళ్ళిరండి అని సున్నితంగా చెప్పడంతో బయటకి నడిచాను.

రిక్షా లాక్కునే హీరో ఇస్త్రీ పేంట్, షర్ట్‌లు వేసుకోవడం ఫైటింగ్ సీన్‌లో హీరో చొక్కా చినగక పోగా, మడతకూడా నలగకపోవడం, అతను పదిమందిని నేల కరిపించడం, విలన్‌లు ఎప్పుడూ తాగుతుండటం, హీరో, హీరోయిన్స్ పరిచయం ఎప్పుడూ పోట్లాటతో మొదలయి చివరికి ప్రేమలోకి దిగడం, హాస్య గాడెపుడూ మినిమం ఐ.క్యూ. కూడా లేని మనిషిలా సర్కస్ బఫూన్ చేసే తెలివి తక్కువ పనులు చేస్తుండటం మొదలయిన సీన్స్ వున్న తెలుగు సినిమాల గురించి ఎవరయినా కామెంట్ చేస్తూంటే నాకా నిర్మాత, దర్శకులే గుర్తొస్తుంటారు. ●



## స్త్రీ

తలవంచి నిలిస్తే
వంటింటి గోడలకు
అతికించబడ్డ 'స్టిక్కర్'!
తలఎత్తి నడిస్తే
పురుషాధిక్యతపై
గురి పెట్టిన
ఎక్కు పెట్టిన 'ట్రిగ్గర్'!!

-పోరంకి హేమ ప్రభాకర్

